సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 2 । ఆగస్టు । 2025



రుణాలు అందక ఇబ్బందులు

సొసైటీలకు పూర్తిస్థాయిలో త్రిసభ్య కమిటీలు, ప్రత్యేక అధికారులు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 8లో



పాముకాటుతో జాగ్రత్త

వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువ. పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో



వెదజల్లే పద్ధతే మేలు

వాతావరణంలో మార్పుల కారణంగా వరి సాగు ఆలస్యమైతే వెదజల్లు పద్ధతి మేలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఇసుక లారీని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు
- లైన్ గోపాలపురం వద్ద ఘటన



ద్వారకాతిరుమల మండలం లైన్ గోపాలపురం వద్ద ఇసుక లారీని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

ద్వారకాతిరుమల: ముందుకెళ్తున్న ఇసుక లారీని వెనుక నుంచి కోళ్ల వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యాడు. ఈ ఘటన ద్వారకాతిరుమల మండలం లైన్ గోపాలపురంలోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. కొవ్వూరు వైపు నుంచి ఏలూరు వైపుకు వెళ్తున్న ఒక ఇసుక లారీని, వెనుక నుంచి బ్రాయిలర్ కోళ్ల రవాణా చేస్తున్న వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, అతని పక్కనున్న మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలు కాగా, స్థానికులు హుటాహుటీన అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమడోలు సీఐ యుజే విల్సన్, ఎస్‌ఐ టి.సుధీర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులకు సంబంధించిన వివరాలేవీ తెలియరాలేదు. అయితే మృతి చెందిన ఇద్దరు, గాయపడ్డ వ్యక్తి బీహార్‌కు చెందిన వారుగా చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జైళ్ల శాఖ పెట్రోల్ బంక్ ప్రారంభం



బంక్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ అంజన్‌కుమార్

భీమవరం : పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలో ఆధునికీకరించిన సబ్ జైలు, జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌లను శుక్రవారం జైళ్ల శాఖ డీజీపీ అంజన్ కుమార్ ప్రారంభించారు. అనంతరం సబ్ జైల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి, ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు ఉన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా అవార్డుల వేడుక నిర్వహించనున్నారని, ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

పింఛన్ల పంపిణీలో వివాదం

కొట్టుకున్న 'తెలుగు' తమ్ముళ్లు

నూజివీడు: పింఛన్ల పంపిణీలో జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం యనమదల శివారు రేగుంటలోని ఇద్దరికి స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో వాటిని లబ్ధిదారులకు అందించేందుకు శుక్రవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొల్లిగొర్ల నాగరాజు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ షహీన, గ్రామంలోని పలువురు టీడీపీ నాయకులు వచ్చారు. అయితే.. అదే గ్రామానికి చెందిన టీడీపీ నా యకుడు సూదిలకుంట సుబ్రహ్మణ్యం అభ్యంతరం వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన టీడీ పీ నాయకుడు జోషి లేకుండా పింఛన్లు ఎలా ఇస్తారని నిలదీశాడు. మంజూరైన రెండు పింఛన్లను దరఖాస్తు చేయించింది జోషినే కాబట్టి ఆయన అందుబాటులో లేనందున సాయంత్రం ఆయనొచ్చాక ఇవ్వాలని స్పష్టం చేశాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి బాహాబాహీకి దిగారు. ఈ ఘర్షణలో గాయపడిన సుబ్రహ్మణ్యం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరి.. కోమవరపు దేవదాసు, కోమవరపు సురేంద్ర, కోమవరపు మనోజ్ తనపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో పక్క కోమవరపు దేవదాసు కూడా ఆస్పత్రిలో చేరి పింఛన్లను పంపిణీ చేస్తుంటే సూదిలకుంట సుబ్రహ్మణ్యం, ఆయన కుమారులు అజయ్‌బాబు, వరుణ్‌బాబు తనపై దాడి చేసి కొ ట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


పక్కాగా భూ సర్వే

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రభుత్వ భూములకు సంబంధించి ఒక్క సెంటు కూడా తగ్గకుండా సర్వే నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ భూముల రీ సర్వేపై అధికారులతో సమీక్షించారు.

అన్నదాతకు వెన్నుపోటు

కోతల కూటమి

- **అన్నదాత సుఖీభవ పథకంలో 21 వేల మంది రైతులకు కోత**
- గతేడాది లబ్ధికి ఎగనామం
- రైతులందరికీ రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఇప్పుడు కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలని మెలిక
- కౌలు రైతులకు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్



భీమవరం: రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించింది కూటమి ప్రభుత్వం. రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యానికి సకాలంలో సొమ్ములు చెల్లించక తీవ్ర ఇక్కట్లు కలిగించిన సర్కారు.. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కూటమి నాయకులు తొలి ఏడాది (2024–25) సాయానికి ఎగనామం పెట్టారు. ఏడాది కాలంలో రైతులకు ఎలాంటి సాయం అందించని ప్రభుత్వం శనివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. అయితే జిల్లాలో గతంలో సాయం పొందిన రైతుల్లో 21 వేల మందిని అర్హుల జాబితా నుంచి కుదించింది.

సాయంలో మెలిక

టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలకు ముందు ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనిపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభంలో వైఎస్సార్ రైతు భరోసా కింద సాయం అందించారు. 2023–24లో జిల్లాలో 1,24,645 మంది రైతులకు సాయం అందగా.. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం కింద సుమారు 1.03 లక్షల మంది అర్హులుగా కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ లెక్కన జిల్లాలో సుమారు 21 మందికి సాయం అందకుండా పోనుంది. జిల్లాలో 20 మండలాల్లో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు.

రైతుల అప్పులబాట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సార్వా, దాళ్వా సీజన్ల ప్రారంభంలో పెట్టుబడి సాయం కింద నగదు అందించేవారు. దీంతో రైతులు ఆనందంగా సాగు ప్రారంభించేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ సాయం అందించకపోవడంతో రైతులు అప్పులబాట పడుతున్నారు. దళారులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు. దీనికి తోడు దాళ్వా సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నెలల తరబడి సొమ్ములు చెల్లించకపోవడంతో రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. ఓ వక్క సాయం అందించకపోగా.. సేకరించిన ధాన్యానికి సకాలంలో సొమ్ములు చెల్లించలేదంటూ రైతులు మండిపడుతున్నారు.

సార్వా నాట్ల ముగింపు దశలో..

జిల్లాలో రైతులు అవస్థల నడుమ ప్రస్తుత సార్వా సీజన్‌లో నాట్లు పూర్తిచేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కలిపి అన్నదాత సుఖీభవ పథకంలో జమచేస్తామని ప్రకటించింది. నారుమడులు, నాట్ల కోసం ఇప్పటికే అప్పులు చేశామని, సొమ్ములు అవసరమైన సమయంలో ఇవ్వకుండా జాప్యం చేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు జాబితా నుంచి సుమారు 21 వేల మందిని కుదించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకు అమలు చేయాలి



అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల సంఖ్య తగ్గించడం దారుణం. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది గడిచిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టడం రైతులకు అన్యాయం చేయడమే. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకూ అమలు చేసి వారిని ఆదుకోవాలి.

– ఎం.రామాంజనేయులు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎస్సీ వర్గీకరణపై మండిపాటు



భీమవరంలో ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

భీమవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం మాల సంఘాల జేఏసీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మాలలు అన్ని రంగాల్లో అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. జాతీయ కన్వీనర్ చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా పనిచేసే రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. మాల సంఘాల జేఏసీ కన్వీనర్ గంటా సుందరకుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 3న కుప్పం నుంచి మాల సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నామని, దీనిని మాల సంఘాల నాయకులు, సభ్యులు విజయవంతం చేయాలని కోరారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, సోడదాసి జయపాల్, కొండేటి లాజర్, వర్ధనపు మోషే, పెట్టెం శుభాకర్, కర్ని జోగయ్య, ఉన్నమట్ల శామ్యూల్‌రాజ్, పరువు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో అధ్వానంగా ప్రభుత్వ హాస్టళ్లు

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో నిర్వహణ అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అయినపర్తి రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జిల్లాలోని పలు హాస్టళ్లను పరిశీలించిన అనంతరం శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయ కర్త చినమిల్లి వెంకటరాయుడుకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ హాస్టళ్లలో పారిశుద్ధ్యం క్షీణించిందని, నేలపై నిద్ర, దోమల స్వైర విహారం సర్వ సాధారణమయ్యారన్నారు. పలు హాస్టళ్లలో దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేయలేదని దీంతో విద్యార్థులు కంటిపై నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరిపడా మరుగుదొడ్లు లేవని, అలాగే మరుగుదొడ్లకు తలుపులు కూడా లేని దుస్థితి నెలకొందని, కనీస మౌలిక వసతులు కరువై విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారన్నారు. నిధుల కొరత కారణంగా మెనూ సక్రమంగా అమలవుతున్న దాఖలాలు లేవన్నారు. తరచూ ఆహారం కలుషితమై విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరిగేల అభిషేక్ అర్జున్, కార్యదర్శి జాన్సన్, ఉపాధ్యక్షుడు సూర్య, అనిల్, వివేక్, ప్రదీప్, ప్రభాష్, గణేష్ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

మైన్స్ అధికారులంటూ వసూళ్లు

- లారీలు ఆపి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు
- ఉన్నతాధికారులకు లారీ యూనియన్ నేతల ఫిర్యాదు

సాక్షి, భీమవరం : మైన్స్ అధికారులుగా చెప్పుకుంటూ జిల్లాలో వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరి వ్యక్తులపై గురువారం లారీ యూనియన్ నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మైన్స్ అధికారుల ముసుగులో ఇద్దరు వ్యక్తులు రెండు రోజులుగా సిద్ధాంతం, పెరవలి, తణుకు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కారులో సంచరిస్తున్నారు. లారీలను ఆపి రికార్డులు చూపించమని, కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. పెనాల్టీల పేరిట వసూళ్లు చేసిన సొమ్ములకు రసీదులు కూడా ఇవ్వడం లేదు. గురువారం సిద్ధాంతం సమీపంలో లారీలను ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఏలూరులోని గనులు, భూగర్భశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు రాజా చెప్పారు. మైన్స్ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులు రెండు రోజులుగా అందుబాటులో లేకుండా తిరుగుతున్నారని, వారు అయి ఉండవచ్చునని అధికారులు అభిప్రాయపడినట్టు రాజా తెలిపారు. ఈ విషయమై మైన్స్ పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి ఏడీని ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



భీమవరంలో గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

భీమవరంలో అలంకారప్రాయంగా ఆఫీస్

భీమవరంలో గనులు, భూగర్భశాఖ జిల్లా కార్యాలయం అలంకారప్రాయంగా మిగిలింది. కార్యాలయ సూపరింటెండెంట్ లాంగ్ లీవ్‌పై వెళ్లిపోగా, సర్వేయర్ డిప్యూటేషన్‌పై ఏలూరులో పనిచేస్తున్నారు. ఒక అసిస్టెంట్ జియాలజిస్ట్ (ఏజీ), ఒక రాయల్టీ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ), ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఏఓ), రెండు ఆఫీస్ సబార్డినేట్, చైన్‌మెన్, డ్రైవర్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని ఇసుక ర్యాంపులు సీఆర్‌జెడ్ పరిధిలోకి వెళ్లి మైనింగ్ నిలిచిపోవడంతో ఖాళీలను భర్తీ చేయడం లేదు. ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు ఏలూరు నుంచి అప్పుడప్పుడూ వచ్చి వెళుతున్నారు.

పర్యవేక్షణ కరువు

జిల్లాలో మైనింగ్ లీజులు లేనప్పటికీ పట్టించుకునే వారు లేక ఆచంట, యలమంచిలి, పెనుగొండ మండలాల్లోని గోదావరి తీరంలో బొండు, ఇసుక, అలాగే నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సముద్ర తీరం వెంబడి ఇసుక, తాడేపల్లిగూడెం రూరల్‌లోని ఆరుగొలనులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిపోతున్నాయి. వీటిపై ఫిర్యాదులు చేస్తే వెళ్లి పరిశీలించే పరిస్థితి ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిలదీద్దాం.. నిలబడదాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెన్మెత్స ఏసురాజు అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై పాలకొల్లు మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు మాట్లాడుతూ అధికారంలో ఉంటే కేసులతో భయపెట్టి పోలీసులతో పాలన చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టినా ప్రజాపక్షాన పోరాటం చేసి విజయం సాధించిన గుండె వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని అన్నారు. వైఎస్సార్‌సీపీ అంటే జగనన్న సైన్యం అని, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు అగ్రపీఠం ఉంటుందని, ఇది జగన్ పంపించిన సందేశం అన్నారు.

వంచనపై పోరాడుదాం

కూటమి నాయకుల మోసపూరిత హామీలపై ఇంటింటా నిలదీయాలని ముదునూరి పిలుపునిచ్చారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అని చెప్పి సూపర్ ఫ్లాప్ చేశారన్నారు. రైతులకు రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 68.50 లక్షల మందికి సామాజిక పింఛన్లు ఇస్తే నేడు కూటమి ప్రభుత్వంలో 60.50 లక్షల మందికే ఇస్తున్నారన్నారు. ఇంటింటికీ వచ్చే చౌక డిపోను దూరం చేశారని మండిపడ్డారు. ఏడాది కాలంలో ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం మోపారన్నారు. ఆరోగ్యశ్రీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. రైతులకు రూ.6,500 కోట్ల బకాయిలు పడ్డారన్నారు. సుమారు 2.80 లక్షల మంది వలంటీర్లను తొలగించారని, వీటన్నింటిపై సీఎం చంద్రబాబుతో పాటు నియోజకవర్గంలోని మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కూటమి నేతలు తొలిఅడుగు అంటూ సిగ్గులేకుండా ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. తల్లికి వందనం ప్రచారం హోరెత్తిపోతుందని కానీ ఈ పథకం అందని ప్రజల ఫొటోలు కూడా వేస్తే వారి నిబద్ధత ఏపాటిదో అర్థమవుతుందని ముదునూరి అన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు, నాయకులు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనందప్రకాష్, కుమారదత్తాత్రేయ వర్మ, జెడ్పీటీసీ నడపన గోవిందరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు. చిత్రంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఇన్‌చార్జి గుడాల గోపి

టీచర్లకు ఈ నెలా ఎగనామమే

- బదిలీ ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాల్లేవు
- ఇప్పటికీ కేటాయించని పొజిషన్ ఐడీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం బదిలీ ఉపాధ్యాయులకు ఈ నెలా మొండిచేయే చూపింది. టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తిచేసిన ప్రభుత్వం.. బదిలీలు అయిన ఉపాధ్యాయులకు మాత్రం జీతాల చెల్లింపులో పూర్తిగా విఫలమైంది. దీనిపై ఉపాధ్యాయులు ఆందోళనలు, నిరసనలు చేపట్టినా సర్కారులో చలనం లేదు. ఈనెల 1న జీతాలు వస్తాయని ఎదురుచూసిన ఉపాధ్యాయులకు భంగపాటే ఎదురైంది.


కొందరికే పొజిషన్ ఐడీలు

సాధారణంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందించాలి. దీని నిమిత్తం పొజిషన్ ఐడీలు కేటాయించాలి. గత నెల 15వ తేదీలోపు అన్ని కేడర్ల ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి చేశారు. బదిలీలు పూర్తి చేసి నెల రోజులు దాటుతున్నా క్లియర్ వేకెన్సీల్లోకి బదిలీ అయిన వారికి మాత్రమే పొజిషన్ ఐడీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొత్తగా సృష్టించిన పీఎస్ హెచ్ఎం, రీపోర్షన్‌మెంట్‌లో కొత్తగా ఏర్పడిన పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు మాత్రం ఇప్పటికీ పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో జూన్, జూలై నెలలకు సంబంధించి ఆగస్టు నెలలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు అందలేదు.

వచ్చే నెలా అనుమానమే..

ఉపాధ్యాయులను బదిలీ చేసిన తర్వాత కేడర్ స్ట్రెంగ్త్‌ను నిర్ధారించి ఆ వివరాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ అండ్ ఆడిట్‌కు అందించాలి. అయితే పాఠశాల విద్యాశాఖ ఇప్పటికీ ఆ పని చేయలేదు. కేడర్ స్ట్రెంగ్త్ అయిన తర్వాతే ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించే అవకాశం ఉంది. బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు ఏరియర్ బకాయిలతో ఈనెల 10వ తేదీలోపు ట్రెజరీకి బిల్లులు పెడితేనే ఈ నెలలో జీతాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈనెల 10లోపు ఈ ప్రక్రియ పూర్తి కాకుంటే బదిలీ అయిన టీచర్లకు జూన్, జూలైతో పాటు ఆగస్టు నెల జీతాలు కూడా సెప్టెంబర్‌లో పడే అవకాశం ఉండదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.. రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.


ప్రభుత్వం విఫలం



బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఒక నెల జీతాలు చెల్లించలేదంటే సాంకేతికలోపమో, పని ఒత్తిడో అని సరిపెట్టుకోవచ్చు. కానీ రెండు నెలల జీతాలు ఆపడం అంటే సీఎస్‌ఈ నిర్లక్ష్యంగానే భావించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా సకాలంలో బిల్లులు చేసి జీతాలు చెల్లించాలి.

– గుగ్గులోతు కృష్ణ, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్

ఉపాధ్యాయులపై కక్ష



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోంది. బోధనేతర పనులు అప్పగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. అనేక రకాల లక్ష్యాలు, యాప్‌ల అప్‌లోడ్ వంటి పనులు అప్పగించడం వారిని అవమానించడానికే. జీతాల చెల్లింపులో అలసత్వంపై ఉపాధ్యాయ లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

– గెడ్డం సుధీర్, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పెట్రోల్‌లో నీరు కలిసిందంటూ..

తణుకు అర్బన్ : ద్విచక్ర వాహనంలో పెట్రోలు పోయించుకుంటే ట్యాంకు నుంచి నీళ్లు బయటపడ్డాయంటూ బాధితులు పెట్రోలు బంక్ వద్ద ధర్నా చేశారు. తణుకుకు చెందిన ఫణి, శంకర్ అనే యువకులు శుక్రవారం స్థానిక హెచ్‌పీసీఎల్‌కు చెందిన తుమ్మలపల్లి పాపారావు బంకు వద్ద తమ వాహనంలో రూ.60లు పెట్రోలు పోయించుకున్నారు. కొద్ది దూరం వెళ్లగానే వాహనం మొరాయించడంతో తిరిగి బంకులోకి వచ్చి యజమానితో మాట్లాడి వాహనం ట్యాంకులోని పెట్రోల్‌ను బయటకు తీయించగా పెట్రోల్‌తోపాటు నీరు బయటపడటంతో అవాక్కయ్యారు. దీంతో పాతవూరుకు చెందిన యువకులు భారీ సంఖ్యలో బంకు వద్దకు చేరి నిరసన తెలిపారు. పట్టణ ఎస్సై శ్రీనివాస్ వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. వాహనంలోని పెట్రోల్ ట్యాంకు నుంచి పెట్రోల్ బయటకు తీయిస్తే సగానికి పైగా నీరు వచ్చిందని, దీనిపై అడిగితే బంకు యజమాని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని బాధితులు అన్నారు. దీంతో ఆందోళనకు దిగినట్టు యువకులు చెప్పారు. విషయం తెలిసి డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి బంకు వద్దకు వచ్చి పరీక్షలు జరిపారు. బంకులో నిల్వ ఉన్న పెట్రోల్‌లో ఎలాంటి నీటి ఆనవాళ్లు లేవని, డెన్సిటీ పరీక్షలతో పాటు సాంకేతిక పరీక్షల్లో ఈ విషయం తేలిందన్నారు.



తణుకులో బంకు వద్ద యువకుల నిరసన

క్లుప్తంగా

మావుళ్లమ్మను దర్శించుకున్న క్రికెటర్ నితీష్ కుమార్



అమ్మవారిని దర్శించుకుంటున్న నితీష్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రముఖ ఇలవేల్పు మావుళ్ళమ్మ వారిని ఇండియన్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఈ నెల 8 నుంచి జరగనున్న ఆంధ్రా ప్రీమియం లీగ్ టీంలో భీమవరం బుల్స్ టీంకు నితీష్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించాలని శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

తణుకు అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు ఈనెల 3న తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. అండర్ 14, 16, 18, 20 బాలుర, బాలికల విభాగాల్లో నిర్వహించనున్నామని, ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వివరించారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 8 గంటలకు తణుకు క్రీడా ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలని, ఇతర వివరాలకు 9989363978 నంబరులో సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో పడి మృతి చెందిన చందు

మండవల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని భైరవపట్నంలో జరిగింది. గ్రామానికి చెందిన పందు జోజి పెద్ద కుమారుడు తరుణ్ అలియాస్ చందు (23) 31న ఒంటి గంట సమయంలో బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. శుక్రవారం ఇంటి పక్కనే ఉన్న చేపల చెరువులో జారిపడి మృతిచెందాడు. పోలీసు సిబ్బంది కేసు నమోదు చేశారు.

రోడ్ల ఆక్రమణలపై చర్యలు



కొయ్యలగూడెంలో గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి సురేష్

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ అంతర్గత రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు కార్యదర్శి కే.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం పంచాయితీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. జూలై 29 సాక్షిలో ప్రచురితమైన అంతర్గత రోడ్ల ఆక్రమణ విషయంపై ప్రజలతో మాట్లాడుతూ స్వమిత్వ కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసుకోవచ్చనని సూచించారు. సాక్షిలో వచ్చిన కథనంపై విచారణ చేసి ఆక్రమణలను గుర్తించామని వారికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా స్వమిత్వ ద్వారా ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు.

రుణాలు అందక ఇబ్బందులు

- సొసైటీల్లో పూర్తి స్థాయిలో లేని త్రిసభ్య కమిటీలు
- ఇంత వరకు 50 సొసైటీలకే త్రిసభ్య కమిటీల నియామకం



కాళ్ల సహకార సంఘం భవనం

భీమవరం: రైతులకు ఎంతగానో ఉపయోగపడే వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు(సొసైటీ) పూర్తిస్థాయిలో త్రిసభ్య కమిటీలు, ప్రత్యేక అధికారులు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జిల్లాలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో పూర్తి స్థాయిలో త్రిసభ్య కమిటీలను నియమించకపోగా ప్రత్యేక అధికారుల పాలన గడువు ముగిసిన సంఘాలకు అధికారులను నియమించకపోవడంతో సొసైటీలో రైతులు రుణం పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 122 సొసైటీలున్నాయి. రైతులు ఎక్కువ శాతం సొసైటీల్లో రుణాలు తీసుకుని పంటలకు పెట్టుబడులు పెడతారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీరో వడ్డీకే రైతులకు పంట రుణాలు ఇవ్వడంతో సొసైటీల ప్రాచుర్యం బాగా పెరిగింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సొసైటీలకు నియమించిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించారు. కూటమి నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇటీవల కేవలం 50 సొసైటీలకు మాత్రమే త్రిసభ్య కమిటీలు నియమించారు. కూటమిలో పదవులు పందేరంలో తమకు ఎక్కువ శాతం పదవులు కావాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పంతాలకు పోవడంతోపాటు ఆయా సొంత పార్టీ నాయకుల మధ్యనే విభేదాలు తలెత్తంతో నామినేటెడ్ పదవుల భర్తీ సందిగ్ధంగా మారింది.

ముగిసిన ప్రత్యేక అధికారుల పాలన

జిల్లాలో కేవలం 50 సొసైటీలకే త్రిసభ్య కమిటీల నియామకం, మిగిలిన సొసైటీల ప్రత్యేక అధికారుల పాలన జూలై 31తో ముగియడంతో పాలకవర్గాలు లేని దాదాపు 70 సొసైటీల్లోని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సొసైటీల్లో రుణాలు ఇవ్వాలంటే రుణం పొందే రైతుల జాబితాపై సంఘం చైర్మన్‌గాని ప్రత్యేక అధికారి సంతకం తప్పనిసరి. ప్రత్యేక అధికారుల పాలన గడువు ముగిసినా ప్రభుత్వం పొడిగించకపోవడంతో రైతులు రుణాలు ఎలా పొందాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సార్వా సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు రుణాలు ఎంతో అవసరం. ఇలాంటి సమయంలో సొసైటీలకు పూర్తి స్థాయిలో కమిటీలను నియమించకపోవడం రైతులు పూర్తి స్థాయిలో రుణాలు పొందే అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో గ్రంథాలయ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించేలా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నిక నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా జీ. రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ రంగారావు, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌డీ.లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జుల్ఫికర్ అలీ, సహాయ కార్యదర్శిగా కొండే వెంకటేశులు, జిల్లా కోశాధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.శోభ, జీ అనిత, బంగారు పాప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు, జేఏసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరనాథ్, ఏపీ ఎన్‌జీఓ ఏలూరు తాలూకా అధ్యక్షుడు జీ శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈ బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని ఏలూరు డీపీఈ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న పీవీవీ సత్యనారాయణను బదిలీ చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వితేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం డీపీఈ విభాగం ఈఈగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. విజయవాడ ఎస్ఎల్‌డీసీ విభాగంలో ఈఈగా పని చేస్తున్న డీ.ఆది నారాయణను ఏలూరులో ఖాళీ అయిన డీపీఈ స్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వర్షాకాలంలో పాముకాటుతో జాగ్రత్త



పశువు వద్ద పాము సంచరిస్తున్న దృశ్యం(ఫైల్)

బుట్టాయగూడెం: వర్షాకాలంలో గ్రామాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు, బీడు భూముల్లో పచ్చని గడ్డి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పశువులు బీడు భూములు, ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో మేతకు వెళ్ళినప్పుడు పశువుల పాక చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో గడ్డి ఎక్కువగా పెరుగుతుంది. ఈ సమయంలో వర్షాల కారణంగా పచ్చని గడ్డిలో విషసర్పాలు ఉండి పశువులను కాటు వేసే ప్రమాదం ఉంది. పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీలుగుమిల్లి పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు సూచించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పాముకాటు నుంచి పశువులను కాపాడుకోవచ్చన్నారు.

రక్తపింజర

పశవులను రక్తపింజర కాటువేస్తే హీమోటాక్సిన్ విడుదలై రక్త ప్రసరణపై ప్రభావం చూపుతుంది. దీంతో పశువు నోరు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. పాము కాటు వేసినచోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మూత్రం ఎరుపురంగులోకి వస్తుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే 10 గంటలలోపు పశువులు మృత్యువాత పడతాయి.

తాచు, కట్ల పాములు

తాచు, కట్లపాములు పశువులను కాటు వేసినప్పుడు న్యూరోటాక్సిన్ వాటి శరీరంలోకి వెళ్ళి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీనితో శ్వాస వ్యవస్థ స్థంభిస్తుంది. నోటి నుంచి నురగ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే పశువు మృతి చెందుతుంది.

విషరహిత పాముల్లో కాటు లక్షణాలు

విషరహిత పాములు కాటు వేసినప్పుడు రెండు వరుస పళ్ల ముద్రలు ఉంటాయి. గాయాలు చిన్నగా ఉంటాయి. ఎక్కువగా పలుచని రేఖల వంటి ముద్రలుగా ఉంటాయి. కొద్దిగా రక్తం కారవచ్చు. కానీ ఇది ప్రమాదమైన స్థాయిలో ఉండదు.

విషపూరిత పాము లక్షణాలు

విషపూరిత జాతి పాములు కాటు వేసిన చోట ఉబ్బినట్టు, గాయంలా కనిపిస్తుంది. పశువు తినకుండా నీరసంగా ఉంటుంది. అదుపు తప్పడం(పిచ్చెక్కినట్టుగా అటూ ఇటూ తిరగడం), నోట్లో నురగరావడం, వేగంగా గుండె చప్పుడు, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, పొట్ట ఉబ్బడం, కింద పడి కాళ్ల కొట్టుకోవడం వంటివి చేస్తాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 గంటల్లోపు కాటుకు గురైన పశువులు మృతి చెందుతాయి.

వైద్యుల సూచనలు

- పాముకాటుకు గురైన పశువులను బయటకు పంపించవద్దు. ఎక్కువగా నడిపించకూడదు. కదలకుండా ఉండాలి.
- కాటు వేసిన ప్రాంతానికి పై భాగంలో గట్టిగా కట్టుకట్టాలి. ఇది పాము విషాన్ని నరాల ద్వారా వ్యాప్తి చెందకుండా ఉపయోగపడుతుంది. 15 నిముషాలకు ఒకసారి నిమిషం పాటు విరమించాలి. లేదంటే నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.
- కాటు వేసిన చోట కడగవద్దు. కట్టు తియ్యొద్దు. ఇలా చేస్తే విషం వ్యాప్తి పెరుగుతుంది.
- పశువులను బాగా గాలి తగిలేటట్టు నీడలో ఉంచాలి.
- వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి చికిత్స అందిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి పశువులను కాపాడుకోవచ్చు.

"

సకాలంలో చికిత్స అందించాలి



పశువులను మేతకు తీసుకువెళ్ళినప్పుడు తరచూ గమనించాలి. పాము కాటు వేస్తే కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టాలి. బ్లేడుతో కోసి రక్తం పిండాలి. 15 నిముషాలకు ఒకసారి కట్టును వదులు చేస్తూ ఉండాలి. స్నేక్ యాంటీ వీనమ్ ఇంజెక్షన్, ఆట్రోపిన్ సల్ఫేట్, ఏవిల్ ఇంజక్షన్‌ను పశువు రక్తంలోకి ఎక్కించాలి. నొప్పి నివారణకు స్టెరాయిడ్, యాంటీ బయోటిక్స్, అవసరాన్ని బట్టి ఇతర మందులను ఇవ్వాలి.

డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



కమతం మహేష్

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా కమతం మహేష్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు సూచనల మేరకు నియామకం జరిగినట్లు మహేష్ తెలిపారు.



మిద్దే వెంకటేశ్వరరావు

- **ఉంగుటూరు:** వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎ.గోకవరానికి చెందిన మిద్దే వెంకటేశ్వరరావును నియమించారు. పార్టీ అధినేత జగన్, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



శివరామకృష్ణ

- **చింతలపూడి:** బీసీ విభాగం ఏలూరు జిల్లా కార్యదర్శిగా చింతలపూడి మండలం, రేచర్ల గ్రామానికి చెందిన పెరుగొండ్ర శివరామకృష్ణను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



నారాయణ రెడ్డి

- **పెనుగొండ:** వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఆచంట నియోజకవర్గం మార్టేరుకు చెందిన మండ విశ్వనాథ నారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.



చల్లారి హేమంత్

- **దెందులూరు:** వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా దెందులూరు నియోజవర్గం నుంచి చల్లారి హేమంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామక ఆదేశాలు జారీ చేశారు.
- **బుట్టాయగూడెం:** వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం రాష్ట్ర కమిటీ ప్రచార వింగ్ కార్యదర్శిగా పోలవరం నియోజకవర్గం నుంచి కొయ్యలగూడెంకు చెందిన తమిర్భి బ్రహ్మయ్యను నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.



త్సల్లాబత్తుల శ్రీనివాసరావు

- **చింతలపూడి:** చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెంకు చెందిన త్సల్లాబత్తుల శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలస్యమైతే వెదజల్లే పద్ధతే మేలు

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో వెదజల్లే పద్ధతిలో నాట్లు వేస్తున్న రైతులు

చింతలపూడి: ఇటీవల వరి సాగులో ఖర్చులు బాగా పెరిగాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఏటా సకాలంలో వరినాట్లు పడటం లేదు. పోసిన నారు ముదిరిపోవడం, లేదా నారు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సాగు ఖర్చును తగ్గించుకుని, కూలీల సమస్యను అధిగమించేందుకు దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తే పద్ధతిని ఆచరించడం మేలని చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకుడు వై సుబ్బారావు సూచిస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో 18,384 హెక్టార్లల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 5,252 హెక్టారుల్లో వరి పంటను సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సుమారు 50 శాతం నాట్లు మాత్రమే పూర్తయ్యాయి.

రైతుకు లాభం

దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తడం వల్ల నారు పోయడం, నారు తీత, నాట్లు వేసే పని ఉండదు. ఈ విధానం వల్ల ఎకరాకు రైతులకు సుమారు రూ.3,500 రూపాయల ఖర్చు తగ్గుతుంది. ఎకరాకు 15–20 కిలోల విత్తనం ఆదా అవుతుంది. మొక్కల మధ్య సాంద్రత ఉండటంతో ఎకరాకు 15 శాతం దిగుబడి పెరుగుతుంది. ఎక్కువ విస్తీర్ణంలో నాటుకోవడం మాత్రమేకాక , వారం పది రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది.

సాగులో మెలకువలు

సాధారణంగా అన్ని రకాల నేలల్లో దమ్ము చేసి వరి విత్తే పద్ధతిని అవలంబించవచ్చు. చౌడు, ఆమ్ల, క్షార నేలలు మాత్రం ఈ విధానానికి అనుకూలం కావు. రకాన్ని బట్టి ఎకరాకు 10 నుండి 15 కిలోల విత్తనం అవసరం అవుతుంది. వరిసాగు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో స్వల్పకాలిక వరి విత్తనాలను ఎంచుకోవడం మేలు. విత్తనాలను 24 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండెకట్టి దమ్ము చేసిన పొలంలో వెదజల్లడం కాని, డ్రమ్ము సీడర్‌తో కాని విత్తుకోవాలి.

డ్రమ్ సీడర్‌తో

డ్రమ్ సీడర్‌తో లాగితే ఒకేసారి 8 వరుసల్లో విత్తనాలు పడతాయి. సాళ్ళ మధ్య 20 సెం.మీ, మొక్కల మధ్య 5–8 సెం.మీ ఎడంగా గింజలు పడతాయి. ప్రతి 16 వరసలకు ఒక అడుగు కాలిబాట వదలాలి. ఇద్దరు కూలీలు రెండు గంటల్లో ఎకరా విత్తనాలను విత్తవచ్చు.

ఎరువుల వాడకం

సాధారణ వరికి సిఫార్సు చేసిన విధంగానే దీనికి కూడ ఎరువుల వాడకం చేపట్టాలి. దమ్ములో మాత్రం నత్రజని ఎరువులు వేయకూడదు. వేస్తే కలుపు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఎక్కువ. భాస్వరం, అర వంతు పొటాష్‌ను దమ్ములో వేసుకోవాలి. నత్రజని ఎరువులను 3 భాగాలుగా చేసుకుని విత్తిన 15–20, 40–45, 60–65 రోజులకు వేయాలి. మిగిలిన సగభాగం పొటాష్ 60–65 రోజులకు నత్రజనితో పాటు వేసుకోవచ్చు.

నీటి వాడకం

విత్తిన దగ్గర నుండి పొట్ట దశ వచ్చే వరకు బురదగా ఉంచి పొట్టదశ నుంచి పంట కోత పది రోజుల ముందు వరకు పొలంలో 2 సెంమీ నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వేరు వ్యవస్థ బాగా బలపడి పిలకలు బాగా వస్తాయి.

కలుపు నివారణ

కలుపు నివారణకు ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా 400 మిల్లీ.లీ ప్రిటిక్లాక్లోర్ లేదా 100 గ్రా పైరజో సల్ఫ్యూరాన్ మందును 20 కిలోల పొడి ఇసుకతో కలిపి విత్తిన 3–5 రోజుల మధ్య పొలంలో పలుచగా నీరుంచి చల్లాలి. విత్తిన 20 రోజుల తర్వాత కలుపు సమస్య అధికంగా ఉంటే ఎకరాకు 80–100 మి.లీ బిస్పైరిబాక్ సోడియం, ఊద ఎక్కువగా ఉంటే 300–400 మి.లీ సైహలోఫాప్ బ్యూటైల్‌ను, వెడల్పాటి ఆకు ఎక్కువగా ఉంటే 4డి సోడియం లవణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



వై.సుబ్బారావు, చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు

గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగేనా?

- అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న ఇరిగేషన్ అధికారులు
- పలు మార్గాల్లో ట్రెంచ్‌ల తవ్వకాలు



పోలవరం కుడి కాలువ గట్టుపై నుంచి మట్టి రవాణా జరుగుతున్న మార్గంలో జేసీబీతో ట్రెంచింగ్

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు కాలువ ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం కాలువ గట్టుపై నుంచి గ్రామంలోకి వెళ్లే పలు మార్గాల్లో ట్రెంచ్ (రోడ్డుకు అడ్డంగా) తవ్వకాలు జరిపారు. వివరాల్లోకి వెళితే. కొందరు టీడీపీ నాయకులు కాలువ గట్టును ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. రాత్రి వేళల్లో దొంగతనంగా గ్రావెల్ తవ్వకాలను జరిపి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో నాయకుడు ఈ మట్టిని అమ్ముకోవడం ద్వారా నెలకు రూ. 3 లక్షల వరకు కూడబెడుతున్నట్టు సమాచారం. అయితే ఈ పచ్చ ముఠా గట్టుపై ఉన్న మట్టిని కాకుండా, ఏకంగా భూమిని తవ్వి గ్రావెల్‌ను అమ్మేస్తున్నారు. దాంతో కాలువ గట్టుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి, అగాధాలను తలపిస్తున్నాయి. అవి ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. ఈ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం సంబంధిత శాఖల అధికారులకు ప్రహసనంగా మారింది.

దొంగ దారుల్లో ట్రెంచ్‌లు..

మట్టి దొంగలు అధికార పార్టీకి చెందినవారు కావడంతో కొందరు అధికారులు చూసిచూడనట్టు వదిలేస్తున్నారు. దాంతో వారి మట్టి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాత్రి అయితే చాలు.. జేసీబీలతో కాలువ గట్టుపైకి చేరి, తవ్వకాలు జరిపేస్తున్నారు. వీరి తవ్వకాలు ప్రమాదకర స్థాయికి చేరడంతో కాలువ ఇరిగేషన్ అధికారులు అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లను పట్టుకునేందుకు కాలువ గట్టు చివరన కాపలా కాస్తున్నారు. అయితే తెలివిమీరిన మట్టి దొంగలు పలు దొంగ మార్గాల గుండా మట్టిని తరలించేస్తున్నారు. దాంతో కాపలా కాసినా ప్రయోజనం లేదని భావించిన అధికారులు ట్రెంచ్ తవ్వకాలను చేపట్టారు. గట్టుపై నుంచి గ్రామంలోకి అక్రమ మట్టి రవాణా జరుగుతున్న పలు మార్గాలను గుర్తించి, పీఐపీఆర్ఎంసీ జేఈ దూర్జటి పర్యవేక్షణలో ట్రెంచ్ లను తవ్వారు.

ఫలితం ఉంటుందా?

ట్రెంచ్‌లు తవ్వడం వల్ల ఫలితం ఉంటుందా అంటే.. గ్రామస్తులు కొందరు ఉండదనే అంటున్నారు. మట్టినే ఆదాయవనరుగా ఎంచుకున్న ముఠాకు ట్రెంచ్‌లు ఒక లెక్క కాదని చెబుతున్నారు. ట్రెంచ్‌లను పూడ్చి, అక్రమ రవాణాను సాగించినా ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. అయితే అధికారుల ప్రయత్నం ఏమేరకు ఫలితాలనిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ట్రంప్ సుంకాల్ని తిప్పికొట్టాలి

ఏలూరు (టూటౌన్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలకు దీటుగా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 శాతం అదనంగా సుంకాలు వసూలు చేయడాన్ని తప్పుపట్టారు. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురు వలన సుంకాల విధిస్తున్నానని ట్రంప్ ప్రకటించడం తన అహంకారానికి నిదర్శనం అన్నారు. ఈ ప్రకటనపై ఇంతవరకు భారతదేశ ప్రభుత్వం గాని, కూటమి ప్రభుత్వం గాని ఎలాంటి స్పందన తెలపకపోవడం బాధాకరమన్నారు. ట్రంపు తనకు మిత్రుడని చెప్పుకొనే ప్రధాని మోదీ కిమ్మనకుండా ఊరుకోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ట్రంప్ సుంకాల ఫలితంగా ఆక్వా రంగం కుదేలైపోతుందని స్పష్టం చేశారు. ఆక్వా రంగం పైనే కాకుండా ఇతర అనేక రంగాలపై కూడా చూపుతుందన్నారు.

జెస్సిరాజ్‌కు సత్కారం

దెందులూరు: ఏసియన్ గేమ్స్ 2025 సబ్ జూనియర్ విభాగం సోలో డాన్స్‌లో సిల్వర్ మెడల్ విజేత ఇంటర్నేషనల్ స్కేటర్ జెస్సీరాజ్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ రవి నాయుడు సత్కరించారు. మరిన్ని అంతర్జాతీయ పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు. కోచ్ సింహాద్రి, ఇండియా టీం కోచ్ సింగ్‌లను అభినందించారు.

క్లుప్తంగా

సర్వ మంగళమ్మకు లక్ష చామంతుల పూజ


లక్ష చామంతుల పూజ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శంకరమఠంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, సర్వ మంగళమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. లక్ష చామంతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, నిర్వాహకులు పూజలలో పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయంలో విశేష పూజలు


బలుసులమ్మ ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బలుసులమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా బలుసులమ్మ అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు, అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

బీసీ, ఎస్టీ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : జిల్లాలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను గత నాలుగు రోజులుగా సందర్శించి అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అరిగెల అభిషేక్ తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించి హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా నిర్వహణ అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాహుల్ అయినపర్తి, తాడేపల్లిగూడెం రూరల్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పెంటపాడు: సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి 27 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఎస్. కుసుమాంజలి ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కన్వీనర్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, టీఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ సుంకర గోపాల్, డాక్టర్ జి. వాణి, జె. విజయబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుళాయిల నుంచి మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లి, 30వవార్డు స్టేషన్‌పేట, జవదాలపేట ప్రాంతాల్లో కుళాయిల నుంచి గత కొన్ని నెలలుగా మురుగునీరు వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. క్లోరినేషన్ సరిగ్గా నిర్వహించకుండానే కాలువ నీటిని అలాగే వదిలేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

ఆకివీడు: ఉపాధ్యాయ డిమాండ్ల పరిష్కారం కోసం శనివారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మండల యూటీఎఫ్ ప్రధా నకార్యదర్శి ఆర్‌వీఎస్.నారాయణ(విక్రమ్) తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరం కలక్టరేట్ వద్ద ఉదయం 9 గంటలకు జరిగే ధర్నాలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ప్రపంచ వెబ్ దినోత్సవం

ఆకివీడు: భవిష్యత్ ప్రపంచం కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)దేనని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వెబ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత

- ఛిద్రమైన రోడ్లు
- అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు
- రాకపోకలకు అవస్థలు


అత్తిలి మండలం ఈడూరు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

అత్తిలి: మండలంలోని రోడ్లు రోడ్లు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. గోతులమయమై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నా, నిర్మాణాలు జరిగి నాలుగైదు దశాబ్దాలు దాటుతున్నా ఆ రోడ్లకు మోక్షం కలగడం లేదు. ఆ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు శాపంగా మారాయి. తణుకు నియోజకవర్గంలో అత్తిలి నుంచి భీమవరం వెళ్లే రహదారిలో రోడ్డు దుస్థితిని చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఏ రహదారిలో వెళ్లాలంటే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్ల అభివృద్ధి చేయడం ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. అత్తిలినుంచి పాలూరు మీదుగా భీమవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వాన్నంగా మారింది. ఈమార్గంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు రోడ్లపై ఉన్న గోతులను తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడటంతో గాయాలైన సంఘనలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే మంచిలి- కోరుకొల్లు రహదారి, ఉరదాళ్లపాలెం-దువ్వ, బల్లిపాడు-పైడిపర్రు, మాముదూరు-ముప్పర్తిపాడు ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతులలో నీరు నిలిచిఉండటంతో ద్విచక్రవాహనదారులు జారిపడుతున్నారు. అత్తిలి మండలం పరిధిలో వరిఘేడు నుంచి మండపాక వెళ్లే రహదారి అధ్వాన్న స్థితికి చేరుకోవడంతో ఈమార్గంలో ప్రయాణించేవారు నానా అగచాట్లు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి అధ్వాన్నంగా ఉన్న రోడ్లను ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు.


వరిఘేడు వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు


ఎర్రనీలిగుంట వద్ద రాళ్లు లేచిన రోడ్డు


పాలూరులో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడ్డ గోతులు

ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి సంవత్సరమైన సందర్భంగా శుక్రవారం స్థానిక తాలూకా సెంటర్‌లో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 22కు పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సుందర్, జైపాల్, కిరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

- ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇదే తంతు
- ఎన్నికల ముందు మొసలి కన్నీళ్లు.. గట్టెక్కిన తరువాత వెన్నుపోటు
- కరెంటు బిల్లులు మోతమోగిస్తున్నారు
- తణుకులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి


తణుకులో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: చంద్రబాబు మాయ మాటలు, వంచనకు ప్రజానీకం నిలువునా మోసపోయారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు 20వ వార్డులో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారదాహంతో చంద్రబాబు ఎప్పటికప్పుడు అమలుకాని హామీలు, మోసపూరిత ఆశలు చూపించి ప్రజలను మాయచేస్తున్నారని స్పష్టం చేశారు. ఈసారి సూపర్‌సిక్స్‌తో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును ప్రజలు ఛీకొడుతున్నారని విమర్శించారు. ఏ పథకం ఇవ్వకుండానే ఏడాది గడిపేశారని, జగన్ ప్రభుత్వంలో మాత్రం మొదటి 6 నెలల్లోనే సంక్షేమాన్ని అందించిన ఘనత సాధించారని అన్నారు. చంద్రబాబు చేసిన మోసానికి ప్రజలు అల్లాడిపోతున్నారని సంక్షేమం ఇస్తారని ఆశపడితే నిట్టనిలువునా మమ్మల్ని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కరెంటు బిల్లులు పెంచమని, నాణ్యమైన కరెంటు ఇస్తామని అవసరమైతే కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెప్పి నేడు కరెంటు బిల్లులతో చంద్రబాబు చార్జీల మోత మోగిస్తున్నాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ బిల్లులకు రెట్టింపుగా ఆంధ్రప్రదేశ్‌లో బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. ఏ గడపలోకి వెళ్లినా ప్రజలు రేషన్ బియ్యం మూటలు మోసుకోలేకపోతున్నామని, గతంలో ఇంటి ముందుకు వచ్చే విధానమే బాగుందని అంటున్నారని అన్నారు. జగన్ చేసిన మంచి పనులన్నింటికీ మంగళం పాడేలా చంద్రబాబు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఈ సందర్భంగా గడపగడపలోకి వెళ్లి మహిళలకు బాబు మోసాన్ని తెలిపే కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి సీతారాం, పబ్లిసిటీవింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి, షేక్ ఫహీమా, వార్డు నాయకులు సీహెచ్ దుర్గా మహేష్, సుందరం, మమత, కలిశెట్టి ప్రకాష్, పార్టీ నాయకులు వీరమల్లు ఫణీంద్రకుమార్, పుల్లెపు సూర్యచంద్రరావు, బిరుదుకోట చింతన్న, పైడి సాయి సూర్య, ఎస్వీ జాకబ్‌బాబు, కొత్తపల్లి చరణ్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో కాలిన యూపీఎస్, విద్యుత్ బ్యాటరీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ఒక రూంలో శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అలారం మ్రోగడంతో బ్యాంక్ వద్ద ఉన్న వాచ్‌మెన్ తదితరులు స్పందించి ఫైర్ సిబ్బందికి సమాచారాన్ని అందజేశారు. తక్షణమే స్పందించిన ఫైర్ ఆఫీసర్ జీవీ రామారావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. యూపీఎస్ సిస్టమ్, బ్యాటరీలు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన సంభవించినట్లు చెప్పారు. యూపీఎస్, విద్యుత్ బ్యాటరీ పూర్తిగా కాలిపోయినట్లు వెల్లడించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని చెప్పారు.


చంద్రబాబు చేసిన మోసం ప్రతి గడపకూ చేరాలి

– పార్టీ శ్రేణులతో మాజీ మంత్రి కారుమూరి


తణుకులో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సూపర్‌సిక్స్ తదితర హామీలతో ప్రజానీకాన్ని చంద్రబాబు చేసిన మోసం ప్రతి గడపకూ చేరాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆయన నివాసంలో శుక్రవారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్ని నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అనే విషయం ప్రజలకు అర్థమైందని, అయినప్పటికీ ఆధారాలతో సహా ప్రజలకు తెలిపే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఇందుకోసం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్ని నేరుగా కలవాలని కోరారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు మనం చేరువయ్యామని, వారికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేశామని గుర్తుచేయాలన్నారు. మంచితోపాటు వారికి చంద్రబాబు చేస్తున్న మోసం, వంచన, అబద్ధాలను అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ ఎంతో హుషారుగా జరుగుతుందని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలో ప్రతి వార్డులోను ఆయా వార్డు నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని, కరపత్రాల్లో ఉన్న క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, నాయకులు పుల్లెపు సూర్యచంద్రరావు, పైడి సాయిసూర్య, వై.రామకృష్ణ, బొల్లా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలి


జగ్గన్నపేట గ్రామంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: కార్మికులందరూ ఐక్యంగా ఉండి కార్మికుల అభివృద్ధికి సంఘం మరింత కృషి చేయాలని పలువురు వక్తలు పచ్చా రామకృష్ణ, మందాల శ్రీను అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘ గ్రామ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ బోర్డులో కార్మికులందరూ సభ్యులుగా చేరాలన్నారు. గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘ భవనాన్ని ఎమ్మెల్యే సహకారంతో త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. యూనియన్ నాయకులు చింతల రాజు, పోనుబోయిన హరిశ్చంద్రప్రసాద్, పలివెల వెంకట్రావు, మండల కోశాధికారి కంకిపాటి రాజు, కార్మికులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

ఆకివీడు: హిందూ ధర్మ పరిరక్షణకు టీటీడీ ధర్మ పరిషత్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు అన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలోని రామాలయంలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారాములోరి ఆలయంలో మహిళలకు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్, పులగం రంగారావు, చెన్నంశెట్టి అప్పారావు, వానపల్లి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

జన హృదయ నేత పైడికొండల మాణిక్యాలరావు


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జన హృదయ నేత స్వర్గీయ పైడి కొండల మాణిక్యాలరావు అని, ఆయన నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని, పలువురు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. మాణిక్యాలరావు 5వ వర్ధంతిని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఈతకోట సత్యనారాయణ స్మారక వర్తక సంఘం భవనంలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, గట్టిం నవీన్, సింధు, రాష్ట్ర నాయకులు పెదపోలు వీర రాఘవులు, కంచుమర్తి నాగేశ్వరరావు, దత్తు ప్రసాద్‌లు మాణిక్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రిగా ఉన్న సమయంలో పట్టణానికి చేసిన విశేష సేవలను కొనియాడారు. అదే విధంగా పైడికొండల విగ్రహం పట్టణంలో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. సింగం రామయ్య, తుమరాడ చిన్నా, ఇమ్మంది శ్రీనివాస్, అయినం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం


కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి


మాట్లాడుతున్న సీడీపీఓ సరస్వతి

తాడేపల్లిగూడెం రూరల్: తల్లి ముర్రు పాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని, తద్వారా ఆరోగ్యకరంగా జీవించడానికి ఉపకరిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం కోడ్ నెం.127 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తల్లి ముర్రు పాలు బిడ్డకు తొలి టీకా వంటిదని పేర్కొన్నారు. ముర్రు పాలు తాగిన ఆరు నెలల వరకు ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. తల్లులు తమ బిడ్డలకు విధిగా ముర్రు పాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. ప్రమీల, జి. సూర్యకుమారి, పి.కనకదుర్గ పాల్గొన్నారు.

బిడ్డకు మొదటి ఆహారం తల్లిపాలు

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక 24వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు సమావేశాన్ని నిర్వహించి తల్లిపాల ఆవశ్యకత గురించి తెలిపారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి టీఎల్ సరస్వతి, సెక్టార్ సూపర్‌వైజర్లు కె.విశాలాక్షి, భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు టి సుజాత, కె.ప్రసన్న, పీఎస్ సావిత్రి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టీటీఎల్ సరస్వతి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను శుక్రవారం వీకర్స్‌కాలనీలో జరిగింది. వక్తలు మాట్లాడుతూ తల్లిపాలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరు నెలలు వరకు తల్లిపాలను మాత్రమే అందజేయాలని పోషకాలు ఉంటాయని చెప్పారు. ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాల వైద్యులు డి.సాయిరాం, మమతా తేజస్వినిలు మాట్లాడారు. సూపరవైజర్లు సీహెచ్ దుర్గ భవాని, కె.విశాలక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం


పశుపోషణపై బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీలు రమణ, కె.గోపాల్

తాడేపల్లిగూడెం: పశుపోషణ, పశు యాజమాన్యం, లాభదాయక మార్కెటింగ్ విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు, యువకులు మంచి ఆదాయాలు పొందవచ్చని శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ.రమణ అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధనా స్థానంలో ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో మల్టీస్టేక్ హోల్డర్స్ వర్కుషాపు, 42వ పశుగణ ఉత్పత్తి యాజమాన్య సంస్థ, 42వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పశుగణ ఉత్పత్తి యాజమాన్య సంస్థ కార్యదర్శి సీహెచ్ వి.శేషయ్య, కోశాధికారి పి.ఆశాలత, సీనియర్ శాస్త్రవేత్త కె.నాగరాజకుమారి తదితరులు మాట్లాడుతూ పంట పొలాలలో వ్యర్థాలను సరైన రీతిలో సేకరించి పశుపోషణలో భాగం చేయడం ద్వారా ఖర్చును నియంత్రించుకోవచ్చన్నారు. గర్భకోశవ్యాధులు నిర్ధారణ, సరైన సమయంలో ఎద లక్షణాలు గుర్తించడం ద్వారా దూడల సంతతిని పెంచుకొని ఆదాయాలు పొందవచ్చన్నారు. ఉద్యానవర్సిటీ వీసీ కె.గోపాల్, విస్తరణ సంచాలకులు గోవిందరాజులు, ఉద్యాన కళాశాల ఏడీ దొరాజీరావులు పశుసంతతి వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదనరావు, డీవీబి రమణ, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.